క్లుప్తంగా

'ఉపాధి' పనుల పరిశీలన



వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో సాయిరాం

రాజాం: మండలంలోని కంచరాం, కొత్తకంచరాం తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీఓ సాయిరాం గురువారం పరిశీలించారు. వేసవి ఎండ చాలా తీవ్రంగా ఉందని, ఎండల సమయంలో పనులు చేయవద్దని సూచించారు. ఈ ఏడాది ఫారంపాండ్ల నిర్మాణానికే అధికంగా నిధులు కేటాయిస్తున్నామన్నారు. లక్ష్యానికి దగ్గరలో ఫారంపాండ్‌ల నిర్మాణం జరుగుతోందని, 38 నిర్మాణాలు పూర్తయ్యేందుకు సిద్ధమయ్యాయన్నారు.

నవదుర్గ హుండీల ఆదాయం రూ.1.18 లక్షలు



హుండీల కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ ఆలయ హుండీల కానుకలు గురువారం లెక్కించారు. ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు సమక్షంలో హుండీలు తెరిచారు. 55 రోజులకు గాను రూ.1,18,837లు సమకూరిందని ఈవో పి.శ్యామలరావు తెలిపారు. కార్యక్రమంలో పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ ఈవో బీవీ మాధరావు, ఆలయ పర్యవేక్షకులు కూరాడ వెంకటరావు, అర్చకులు రామాయణం శ్రీనివాసశర్మ, రంపా రామచంద్రరావుశర్మ, ఇందు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని ఎంఈవోలు త్రినాధరావు, పాపారావు సూచించారు. మండలంలోని జన్నివలస ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హోమ్‌వర్కు, చేతిరాత పుస్తకాలు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం వంటకాలతో పాటు తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి



వీఆర్‌వోలకు సూచనలిస్తున్న తహసీల్దారు శ్రీను

బొబ్బిలిరూరల్: గ్రామాల్లోని రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దారు ఎం.శ్రీను ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌వోలతో గురువారం సమావేశమైన ఆయన.. మండల కేంద్రంలోనే కొన్ని రెవెన్యూ సమస్యలు పరిష్కరించగలమని, దీనిపై అవగాహన లేకపోవడంతో కొంతమంది రైతులు సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌కు వెళ్తున్నారన్నారు. జగనన్న లేఅవుట్లలో అనర్హులను గుర్తించాలని, మిగుల స్థలాల వివరాలు ఆన్‌లైన్‌లో పొందపరచాలన్నారు. ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఆర్‌ఐ రామకుమార్, డీటీలు సుబ్బారావు, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి



రాజాం సిటీ: మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: చెత్త నుంచి సంపద సృష్టించేందుకు క్లాప్‌మిత్రలంతా చెత్తను క్రమపద్ధతిలో వేరు చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని సోపేరు గ్రామ ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు వద్ద పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు చెత్త నుంచి సంపద తయారీపై గురువారం శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో ఇంటింటి నుంచి సేకరించిన చెత్త నుంచి తడి, పొడి చెత్తను వేరు చేసి, చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించాలని, అక్కడ సేంద్రియ ఎరువు తయారు చేసి, సబ్సిడీపై రైతులకు అందించాలన్నారు. ఇలా చేస్తే పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చవచ్చన్నారు.

బాడంగి: మండలంలోని కోటిపల్లి గ్రామంలో క్లాప్‌మిత్రలకు చెత్త నుంచి సంపద తయారీపై ఇచ్చే 8 రోజుల శిక్షణ గురువారం ప్రారంభమైంది. సర్పంచ్ మార్పిన శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ భోగి గౌరి, వైస్ ఎంపీపీ భాస్కరరావు పాల్గొని, క్లాప్‌మిత్రలకు పలు సూచనలు చేశారు.

శిథిలావస్థలో.. వంతెనలు!

నియోజకవర్గంలో కాలువల ఆధారిత వంతెనలు

మండలం	కాలువ పేరు	వంతెనలు	ప్రమాదకరంగా ఉన్నవి
రాజాం	తోటపల్లి	8	2
రాజాం	సారధి	4	2
వంగర	తోటపల్లి	3	1
రేగిడి	మడ్డువలస	8	1
రేగిడి	ఏకేఎల్ గెడ్డ	6	3
రేగిడి	సాయన్న గెడ్డ	4	3
సంతకవిటి	మడ్డువలస	5	1
సంతకవిటి	నారాయణపురం	11	9
సంతకవిటి	సాయన్న చానల్	6	5
సంతకవిటి	రెల్లి గెడ్డ	4	2

- ప్రమాదకరంగా సాగునీటి కాలువల వంతెనలు
- కొన్నిచోట్ల బీటలు వారిన బ్రిడ్జిలు
- మరికొన్ని చోట్ల రైలింగ్‌లు లేని నిర్మాణాలు
- ప్రమాదం అంచున ప్రయాణాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ధ్వంసమైన సంతకవిటి మండలం, రామారాయపురం వద్ద సాయన్న చానల్ వంతెన

రాజాం:

సాగునీటి కాలువలపై నిర్మించిన వంతెనలు ఇప్పుడు ప్రమాదకరంగా మారాయి. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనలు కావడం, కొన్నిచోట్ల నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, ప్లానింగ్ సక్రమంగా ఉండకపోవడంతో వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి మీదుగా ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణాలు చేస్తున్నారు. ఒక్కోసారి ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు కూడా పోతున్నాయి. ఈ నేపథ్యంలో బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. అయినా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రధాన రహదారులను ఆనుకునే..

రాజాం నియోజకవర్గంలో ప్రధానంగా తోటపల్లి, మడ్డువలస, నారాయణపురం, సారధి గెడ్డలను ఆనుకుని ప్రధాన రహదారులు ఉన్నాయి. వీటికి ఆయా కాలువల వద్ద వంతెనలను గతంలో నిర్మించారు. ఈ వంతెనలు అప్పటి ఆవశ్యకతకు అనుగుణంగా నిర్మించడంతో పాటు నాణ్యత పలుచోట్ల లోపించడంతో ఇప్పుడు వాటి పరిస్థితి దారుణంగా తయారైంది. పలుచోట్ల ఈ వంతెనల పిల్లర్లు పూర్తిగా బీటలు వారి ఏ క్షణానైనా కూలిపోవడానికి సిద్ధంగా ఉండగా, మరికొన్ని చోట్ల వంతెనల రైలింగ్‌లు పాడవ్వడం, ఊడిపోవడం వంటివి జరిగి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాటి మీదుగా ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే అసలే పాడైన వంతెనలు.. ఆపై ఇరుకు కావడంతో వాటిపై ప్రమాదాలు సాధారణమైపోయాయి.

వర్షాకాలంలో బిక్కుబిక్కు..

సంతకవిటి, రేగిడి, రాజాం మండలాల్లో ప్రధాన రహదారులను ఆనుకుని ఉన్న కాలువల వంతెనలు వర్షాకాలంలో అయితే మరీ దారుణంగా తయారవుతాయి. శిథిలమైన, బీటలు వారిన, పాడైన, రైలింగ్‌లు లేని వంతెనల మీదుగా నిత్యం ప్రయాణం చేసే వారు.. వర్షాల సమయంలో ఆయా వంతెనల మీదుగా ప్రవహిస్తుండే వరదనీటిలో బిక్కుబిక్కుమని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. రాజాంలో పెనుబాక, అంతకాపల్లి ప్రాంతాల్లో సారధి గెడ్డ వంతెనలు బీటలు వారి, రైలింగ్‌లు లేక చాలా అధ్వానంగా తయారయ్యాయి. సంతకవిటిలో వాసుదేవపట్నం, మల్లయ్యపేట, రామారాయపురం తదితర గ్రామాల వద్ద నారాయణపురం, సాయన్న చానల్ కాలువల వంతెనలు పాడయ్యాయి. ఆయా బ్రిడ్జిల వద్ద రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతుంటాయి. రేగిడి మండలంలోని ఏకేఎల్ గెడ్డ పరిధిలోని రేగిడి, తునివాడ తదితర ప్రాంతాల మధ్య వంతెన కల్వర్టులు అయితే వర్షాకాలంలో పూర్తిగా నీటితో నిండి ఉండిపోయి ప్రయాణాలకు ఆటంకం కలిగిస్తాయి.

వంతెనలు బాగు చేయాలి..



నిత్యం వేలాది మంది ప్రయాణించే ప్రధాన రహదారుల్లోని కాలువల వంతెనలను బాగు చేయాలి. ఎప్పుడో నిర్మించినవి కావడంతో ఇప్పుడు బాగా పాడయ్యాయి. రైలింగ్‌లు లేకపోవడం, బీటలు వారడం వంటివి కనిపిస్తున్నాయి. ఆయా చోట్ల కొత్త బ్రిడ్జిలు నిర్మించాలి. వాసుదేవపట్నం వద్ద నారాయణపురం కాలువ వంతెన అయితే ఏ క్షణానైనా కూలిపోవచ్చు. –రేగిడి రాజు, వాసుదేవపట్నం, సంతకవిటి మండలం

పట్టించుకునే నాథుడే లేడు..



వంతెనల పరిస్థితిపై ఆర్‌అండ్‌బీ అధికారులకు చెబితే తమకు కాదు ఇరిగేషన్ అధికారులకు చెప్పండి అని అంటున్నారు. చివరికి పట్టించుకునే నాథుడే లేడు. సంతకవిటి మండలంలోని వాసుదేవపట్నం, మల్లయ్యపేటల వద్ద నారాయణపురం కుడి కాలువ వంతెనలు ఇప్పుడు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఏదో ఒకరోజు అవి ఆకస్మికంగా కూలిపోయే ప్రమాదం ఉంది. సాయన్న గెడ్డ వంతెన కూడా బాగాలేదు. –ఎన్ని శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్, రామారాయపురం, సంతకవిటి మండలం



శిథిలావస్థలో సంతకవిటి మండలం, మల్లయ్యపేట వద్ద ఉన్న నారాయణపురం కాలువ వంతెన



ఓ వైపు రైలింగ్ లేని రాజాం మండలంలోని అంతకాపల్లి వద్ద ఉన్న సారధి గెడ్డ వంతెన



రాజాం మండలం, పాగిరి వద్ద ప్రమాదకరంగా ఊరగెడ్డ వంతెన



పాడైన రేగిడి మండలంలోని ఏకేఎల్ గెడ్డ వంతెన

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి

వృత్యంతర శిక్షణలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రీస్కూల్ నిర్వహణతో పాటు చిన్నారుల విద్య, ఆరోగ్యం, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ వంటి అంశాలను ఐసీడీఎస్ పీవోలు తెలియజేశారు. ప్రీస్కూల్ విద్యాబోధన మెరుగుపడాలని, పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం దిశగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు.



బొబ్బిలిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు

–బొబ్బిలి, బాడంగి, వంగర, రేగిడి

సారా నియంత్రణకు చర్యలు



ఎంపీడీవోతో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్‌ఐ ఇమ్మానుయేల్

రేగిడి: సారా నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని రాజాం ఎక్సైజ్ ఎస్‌ఐ జి.ఇమ్మానుయేల్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జి.శ్యామలాకుమారిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన.. సారా రహిత గ్రామాలకు కృషి చేస్తున్నామని, దీనికి పంచాయతీ ఉద్యోగులు సహకరించేలా చూడాలని కోరారు. ఎక్కడైనా సారా తయారు చేసినా, తరలించినా, విక్రయించినా గ్రామాల్లోని మహిళా పోలీసుల ద్వారా సమాచారం వచ్చేలా చూడాలన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



వంగర: ఆధార్ కేంద్రం సేవలు పరిశీలిస్తున్న ఎంపీడీవో త్రినాథ్

వంగర: ఆధార్ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో లోపింటి త్రినాథ్ కోరారు. స్థానిక సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. పుట్టిన పిల్లలకు కొత్త ఆధార్ నమోదు, ఆధార్ అప్‌డేట్స్, పేరు, అడ్రస్ మార్పు వంటి సేవలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రామకృష్ణ, డీఏ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని సంకిలి, కోడిశ, ఉనుకూరు, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో ఎ.శ్యామలాకుమారి తెలిపారు. లక్ష్మీపురం ఆధార్ కేంద్రాన్ని ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

రాజాం: మండలంలోని దోసరి గ్రామ సచివాలయంలో ఆధార్ స్పెషల్ డ్రైవ్ గురువారం నిర్వహించారు. పలు గ్రామాల చిన్నారులకు కొత్త ఆధార్ కార్డులు మంజూరు చేయడంతో పాటు ఆధార్‌లో తప్పులు సవరించామని పంచాయతీ కార్యదర్శి రామనారాయణ, డిజిటల్ అసిస్టెంట్ వెంకటేష్‌లు తెలిపారు. శ్యాంపురం సచివాలయంలో శుక్రవారం ఆధార్ సేవలు ఉంటాయన్నారు.

భూముల రీసర్వేకు సహకరించాలి



అవగాహన ర్యాలీలో బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు, పక్కనే తహసీల్దార్ హేమంత్‌కుమార్

తెర్లాం: మండలంలోని లోచర్ల గ్రామంలో చేపట్టనున్న భూముల రీసర్వేకి ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులంతా సహకరించాలని బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు కోరారు. తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ గ్రామంలో రీ సర్వేపై అవగాహన ర్యాలీ, గ్రామసభ గురువారం నిర్వహించారు. గ్రామంలో రీసర్వేకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, సర్వే తర్వాత ఎటువంటి సమస్యలు ఉన్నా గ్రామసభలో తెలియజేయాలన్నారు. తహసీల్దార్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ భూముల రీసర్వేకు సర్వేయర్లు వచ్చినప్పుడు రైతులంతా తమ భూముల వద్ద ఉండి సరైన హద్దులు చూపించాలన్నారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రవికిరణ్, మండల సర్వేయరు సాయి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న వెలుగు ఏసీ ఆదియ్య

రామభద్రపురం: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా స్త్రీనిధి రుణాలు అందజేస్తున్నామని వెలుగు ఏసీ ఎస్.ఆదియ్య తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం కె.అన్నపూర్ణతో కలిసి వీవోఏలు, సీసీలతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్త్రీనిధి రుణాల వసూళ్లు వేగవంతం చేయాలని సూచించారు. గజపతినగరం క్లస్టర్ పరిధిలో 6,630 మంది మహిళలకు స్త్రీనిధి కింద రూ.38.75 కోట్లు రుణాలు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటివరకు 4,600 మందికి రూ.37.92 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. వ్యవసాయ రైతుల ఆర్థిక బలోపేతానికి పైలట్ ప్రాజెక్టు కింద రామభద్రపురం మండలంలో రామభద్రపురం, దత్తిరేజేరు మండలంలో పోరలి, సరాయివలస, గడసాం, టి.బూర్జవలసలను ఎంపిక చేసి ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రామభద్రపురంలో 290, దత్తిరేజేరు మండలంలో 180 మంది రైతు కుటుంబాల వివరాలు సేకరించామన్నారు.

పాఠశాలను తరలిస్తే ఊరుకోం..



బొబ్బిలి మండలం, రంగరాయపురం యూపీ పాఠశాలను పెంట గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విలీనం చేయడాన్ని అడ్డుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి పిలుపునిచ్చారు. సదరు పాఠశాల విలీనానికి సంబంధించి, విద్యాశాఖ మ్యాపింగ్ చేయడంపై యూటీఎఫ్ నాయకులు ఆ గ్రామంలో గురువారం సాయంత్రం పర్యటించి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. రంగరాయపురంలోని 6, 7, 8 తరగతుల విద్యార్థులను పెంట గ్రామ స్కూల్‌కు తరలిస్తే అంత దూరం వెళ్లలేక కొంతమంది విద్యకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. తక్షణమే పాఠశాల విలీనం ప్రక్రియను నిలిపివేయాలని స్కూల్ కమిటీ చైర్మన్ ఎం.కృష్ణ, వైస్ చైర్మన్ జి.పాప విజ్ఞప్తి చేశారు. పాఠశాలను తరలిస్తే ఆందోళన తప్పనిసరిగా చేస్తామని తల్లిదండ్రులు హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, శ్రీనివాస్, పకీర్ నాయుడు, రామకృష్ణ, కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలిరూరల్

సాగునీటి సమస్యలు పరిష్కరించండి



సాగునీటి సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన ఆ పార్టీ నాయకులతో కలిసి తెర్లాం తహసీల్దారు కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని సతివాడ, గొలుగువలస, సింగిరెడ్డివలస, సీతారాంపురం తదితర గ్రామాల్లో నెలకొన్న సాగునీటి సమస్యలతో అక్కడి రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తోటపల్లి ప్రధాన కుడికాలువ పక్కనే ఉన్న ఆరు గ్రామాలకు సాగునీరు అందడం లేదని, నెమలాం వద్ద ఉన్న పిల్లకాలువ ఆక్రమణకు గురికావడంతో చెరువులు, పొలాలకు సాగునీరు రావడం లేదన్నారు. తోటపల్లి కాలువ నిర్మాణానికి భూములిచ్చిన రైతులకే సాగునీరు అందించకపోతే ఎలా అని ప్రశ్నించారు. స్పందించిన ఆర్డీవో.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఆర్డీవో వెంట తహసీల్దారు హేమంత్‌కుమార్, హెచ్‌డీటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. –తెర్లాం

ఇళ్లస్థలాలు ఇవ్వాలని వినతి



తమకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని మాజీ సైనికులు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా మాజీ సైనికుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు మరడ రామినాయుడు ఆధ్వర్యంలో బొబ్బిలి తహసీల్దారు కార్యాలయానికి గురువారం వెళ్లి, వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా దేశ రక్షణకై భారత సైన్యంలో పని చేసిన తమకు సొంత ఇళ్లు లేవని, ఇళ్లస్థలాలు కేటాయిస్తే ఇళ్లు నిర్మించుకుంటామన్నారు. ఉద్యోగ విరమణ పొంది 20 ఏళ్లు గడుస్తున్నా తమకు ఏ ప్రభుత్వమూ ఇళ్లు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులతో చర్చించి, తమ సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ అధ్యక్షుడు ఆర్.కిరణ్‌కుమార్, కార్యదర్శి గోవిందనాయుడు తదితరులు పాల్గొన్నారు. –బొబ్బిలిరూరల్

సంక్షిప్తంగా...

అవకతవకలకు పాల్పడితే చర్యలు

వంగర: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, మస్తర్లలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీవో మర్రాపు సత్యవతి హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో గురువారం సమావేశమైన ఆమె.. పనుల ప్రదేశంలో నీరు, నీడ, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని గ్రామాల్లోనూ ఫారంపాండ్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు.

సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలి

బొబ్బిలిరూరల్: రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని డీలర్లు, ఎండీయూ వాహనదారులకు తహసీల్దారు ఎం.శ్రీను సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని అన్ని రేషన్‌షాపుల డీలర్లు, ఎండీయూ వాహనదారులతో గురువారం సమావేశమైన ఆయన.. లబ్ధిదారులకు సకాలంలో రేషన్ పంపిణీ జరగడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయని, కొంతమంది డీలర్లు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఇకపై ఎవరిపైన అయినా ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు.

ఆరోగ్య తనిఖీలు

రాజాం సిటీ: స్థానిక సెయింట్ ఆన్స్ స్త్రీశక్తి కేంద్రంలో ఆశాజ్యోతి గృహ కార్మికుల ఆధ్వర్యంలో సెయింట్ ఆన్స్ ఆస్పత్రి వైద్యులచే గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గృహ కార్మికులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించడంతో పాటు బీపీ, షుగర్ పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ సిస్టర్ ఏంజెల్, సెల్వ, వైద్యుడు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

మే 20న సార్వత్రిక సమ్మె

రాజాం సిటీ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు మే 20వ తేదీన చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక నేత సీహెచ్ రామ్మూర్తినాయుడు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని, అనేక ఏళ్లుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కేంద్రం కొత్తగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ మానుకోకపోతే పతనం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మి, అనీల్‌కుమార్, గురువులు, బాలరాజు, శంకరరావు, కృష్ణ, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

బొబ్బిలి: స్థానిక షిర్డీసాయి డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడును పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు బుధవారం రాత్రి సత్కరించారు. తనకు ఓటు వేసిన వారందరికీ కృతజ్ఞతలని, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీనివాసులునాయుడు తెలిపారు.

వంగర: అధికారులు విధి నిర్వహణలో నిజాయితీగా పనిచేసి సేవలందిస్తే మంచి గుర్తింపు వస్తుందని ఎంఈవోలు పి.ప్రవీణ్‌కుమార్, ఖండాపు జగదీశ్వరి అన్నారు. మండల కేంద్రంలో ఎంఈవోగా సుదీర్ఘకాలం సేవలందించి బదిలీపై వెళ్లిన యాగాటి దుర్గారావును విద్యాశాఖ ఉద్యోగులు గురువారం ఘనంగా సన్మానించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

బొబ్బిలిరూరల్: స్థానిక వెలుగు కార్యాలయంలో 14 గ్రామాల మహిళా సమాఖ్య సంఘాల సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన కల్పించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు, వ్యవసాయ శాఖ ఏడీఏ మజ్జి శ్యామసుందర్‌లు.. మహిళలకు ప్రకృతి వ్యవసాయ విధానాలు, దాని ద్వారా వచ్చే లాభాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయోత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, ప్రకృతి సేద్యం చేస్తే లాభాల బాట పట్టవచ్చన్నారు.

పంచాయతీ కార్యదర్శి లేక అవస్థలు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని సర్పంచ్ బుడుమూరు పట్టాభి అన్నారు. ఇదే విషయమై ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. సంకిలి సచివాలయంలో పంచాయతీ కార్యదర్శిగా ఉన్న కూర్మారావు డిప్యుటేషన్‌పై శ్రీకాకుళం జిల్లా గార పంచాయతీకి విస్తరణ అధికారిగా బదిలీ అయ్యారని తెలిపారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా ఎవరినీ నియమించకపోవడంతో సిబ్బందికి జీతాలు లేకపోవడంతో పాటు పంచాయతీలో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే కూర్మారావు డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని, సంకిలి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా వెనక్కి పంపాలని కోరారు.